# దూరపుకొండలు

**-కె. తాయారమ్మ.**

'ఆదర్శ మహిళా మండలి' అన్న బోర్డు చూసి లోపలికి నడిచిందామె.

ఆమెకి ముప్ఫై ఐదేళ్ళుంటాయి.

అక్కడ కొందరు స్త్రీలు కార్డ్సు ఆడుతున్నారు. మరికొందరు టి.వి.లో క్రికెట్ చూస్తున్నారు. మరికొందరు ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు.

''ఏమండీ రావచ్చా!'' అందామె.

కార్డ్సు ఆడుతున్న స్త్రీలలో ఒకామె తలపైకెత్తి ప్రశ్నార్థకంగా చూసింది.

''నేనీ ఊరికి కొత్త! మహిళా మండలిలో చేరదామని వచ్చేను! నేను మెంబరుగా చేరచ్చాండీ'' అమాయకంగా ముఖం పెట్టి అడిగిందామె.

''నిరభ్యంతరంగా చేరొచ్చు! నెలకి ఇరవై రూపాయలు మెంబర్‌షిప్ కట్టాలి. ఇంతకీ మీపేరు?''

''అంజమ్మ''

''అందరూ ఒక్కసారి ఫక్కున నవ్వారు.

తన తప్పేమిటో అర్థం కాలేదామెకి.

తనని తాను సంబాళించుకుని, ''మీరు అన్ని పత్రికలూ తెప్పిస్తారా?''

''అన్నీ తెప్పిస్తాం'' ప్రభ, స్వాతి, జ్యోతి, విపుల, చతుర, అన్నీ తెప్పిస్తాం. ఇంకా ప్రసిద్ధ నవలాకారుల నవలలు కూడా తెప్పిస్తాం.''

యండమూరి, మల్లాది, కొమ్మూరి, ఇంకా..ఇంకా గొప్ప గొప్ప రచయితల సీరియల్ నవలలన్నీ వున్నాయి మా లైబ్రరీలో.

ఇంకొక ఆమె అంది గర్వంగా.

ఆమె కళ్ళు ఆనందంతో వెలిగాయి. తనకిష్టమైన పుస్తకాలన్నీ దొరుకుతాయిక్కడ. 'హాయిగా చదువుకోవచ్చు' అనుకుంది తనలో.

''అయినా ఈ పత్రికలతోటి పుస్తకాలతోటీ నీకేం పని? హాయిగా ఏ పిండివంటలో, కుట్లో, అల్లికలో నేర్చుకో! నీకు కాలక్షేపంగా వుంటుంది.'' అన్నారు వాళ్లందరూ ఒక్కసారి.

అంజమ్మ కళ్లల్లో ఏదో అనిర్వచనీయమైన భావం తొణికిస లాడింది క్షణకాలం. చిరునవ్వు మెరిసింది పెదాల మీద.

''లేదు. నేను పుస్తకాలు చదువుకోడానికే వస్తాను ఇక్కడికి. ఇందండి ఇరవై రూపాయలు'' అంటూ ఇరవై రూపాయల నోటు అందించింది అంజమ్మ అందులో మొదట పలకరించిన ఆమెకి.

డబ్బులు అందుకుంటూ ఆమె అంది. ''అన్నట్టు చెప్పడం మరిచిపోయాను. నేను ఈ క్లబ్బుకి ప్రెసిడెంటుని. నా పేరు స్వయం ప్రభాదేవి. ఈమె క్లబ్ సెక్రెటరీ భానుమతీ జనార్ధన్. వీళ్ళందరూ క్లబ్ మెంబర్సు, మిసెస్ సవితా ప్రమోద్, జయశ్రీ రెడ్డి, రంజితా మౌళి. వీళ్ళందరూ హై సొసైటీ లేడీస్. అయినా వీళ్లందరితో నీకేం పని? నీకు వీలైనప్పుడు వచ్చి పుస్తకాలు చదువుకో.''

''అలాగేనండీ మావారూ పిల్లలూ వచ్చే వేళయింది. ఇంటికి వెళ్తానండి.'' అంజమ్మ అంది.

''వెళ్ళమ్మా వెళ్లు!'' అంటూ వాళ్లందరు మళ్ళీ ఆటలో మునిగిపోయారు.

అంజమ్మ మనస్సు అదోలా అయింది.

''ఆదర్శ మహిళా మండలి అంటే ఇదా?'' అనుకుంటూ ఇంటిదారి పట్టింది అంజమ్మ.

మరునాడు అంజమ్మ వెళ్ళేసరికి వాళ్లందరూ కొత్త పత్రిక ఒకటి పట్టుకుని ఆత్రుతగా చదువుతున్నారు.

అదేమిటో ఎంతకీ అర్థం కాలేదు అంజమ్మకి. తరువాత తెలిసింది భానుమతీ జనార్ధన్‌గారి పినతల్లి కూతురు ఇందువదన కథ పడింది అందులో.

''అనతికాలంలోనే ఎవరెస్టు శిఖరానికి ఎక్కుతుంది మా ఇందు!'' అప్పుడే పెద్ద రచయిత్రుల కేడర్‌లోకి వెళ్లిపోతోంది.

''ఇదిగో చూడండి. ఈ ''యామిని'' పత్రికలో ఆమె కథ 'రాళ్లవాన'కి ఫస్టు ప్రైజ్ వచ్చింది. ఐదువేల రూపాయలు. ఐదు వేల రూపాయలు. నిజంగా ఈ ప్రఖ్యాత రచయిత్రి భానుమతీ జనార్ధన్‌గారి పినతల్లి కూతురు కావడం మనందరికి గర్వకారణం.''

భానుమతీ జనార్ధన్ కళ్లు ఆనందంతో వెలిగాయి.

''ఏమండీ'' 'యామిని' పత్రికలో కలహంసగారి సీరియల్ స్టార్ట్ అయిందాండీ?'' మెల్లిగా ప్రశ్నించింది అంజమ్మ.

''ఓహో నువ్వా?'' ఈవిడగారికి సీరియల్ కథల పిచ్చి వున్నట్టుంది. అంటూ ''స్టార్ట్ అయింది తల్లీ! నీలాల నింగిలో జలతారు మబ్బులు! అయినా కలహంస గారి రచనల విలువ నీకు తెలుసా? అని. అందులో ఎంత సామాజిక స్పృహ వుంటుందని'' ఇంకా ఏవేవో అని గట్టిగా ఊపిరిపీల్చుకుంది స్వయం ప్రభాదేవి.

యామిని ముఖంలో నీలినీడలు కదిలాయి క్షణకాలం. ''మనిషిని మనిషిగా చూడడం వీళ్లకి తెలియదా? తనతో మాట్లాడడమే తప్పుగా భావిస్తున్నారు వీళ్లు. వేష భాషల్ని బట్టి మనుష్యుల అంతరంగాల్ని అంచనా వేస్తున్నారు వీళ్లు!''

దూరంగా వెళ్లి ఓ కుర్చీలో కూచుని ఓ పత్రిక చేతులోకి తీసుకుంది.

వాళ్లంతా ఇంకా మాట్లాడుతూనే వున్నారు. వాళ్ల మాటలన్నీ సాహిత్యం మీదే. అందునా ఇందువదన రచనల గురించే!

మధ్య మధ్యలో అటు వైపు చూస్తోంది అంజమ్మ. కూల్‌డ్రింక్స్ తాగుతున్నారు. నవ్వులు ఆకాశాన్ని అంటుతున్నాయి.

ఆనాటి ఖర్చంతా భానుమతీ జనార్ధనే పెట్టుకుంది. అందరూ 'యామిని' పత్రికకి ఉత్తరాలు రాసేరు ఇందువదన కథని పొగుడుతూ.

వింతగా విచిత్రంగా చూస్తూ, మరికొద్ది సేపటి తరవాత కలహంసగారి కథా సంకలనాలు కొన్ని, సీరియల్స్ కొన్ని పట్టుకుని ఇంటి వైపు నడిచింది అంజమ్మ.''

అంజమ్మ రోజూ క్లబ్‌కి వెళ్తూనే వుంది. ఆ చేదు అనుభవాల్ని రుచి చూస్తూనే వుంది.

'ఆదర్శ మహిళా మండలి' అంటే ఎన్నో ప్రయోజనకర విషయాలుంటాయనుకుంది. కాని అక్కడ కూడా ఎక్కువ తక్కువలే.

తను వేషంలోనూ, భాషలోనూ, స్థాయిలోనూ, దర్పం లోనూ, ఏనాటికి వాళ్లతో సరితూగ లేదేమో?''

''ఈ అంతరాలు దేనికి?''

''నువ్వా క్లబ్‌కెళ్లి ఏం నేర్చుకుంటున్నావోయ్?'' తమాషాగా ప్రశ్నించాడు భర్త.

''పెసర పుణుకులు చెయ్యడం, చినిగిన బట్టలు కుట్టుకోవడం, అడపాదడపా ఏవో పత్రికలు

తిరగెయ్యడం.''పంటి బిగువున నవ్వుని దాచి సమాధానం చెప్పింది అంజమ్మ.

ఇద్దరూ నవ్వుకున్నారు క్షణకాలం.

రోజులు దొర్లిపోతున్నాయి.

మహిళలందరూ కలిసికట్టుగా పని చేసే ఏదైనా సామాజిక ప్రయోజనాన్ని సాధించాలి. చెడు నిర్మూలించాలి! అంతరాలు లేకుండా హాయిగా వుండాలి.

కాని ఇక్కడ జరుగు తున్నదేమిటి? ఆధిక్యతలు, హోదాలు, మనిషిని మనిషిగా చూడలేని సంకుచిత మనస్తత్వాలు.

సమాజం ఎటు పోతోంది? అంజమ్మ అంతరంగం అల్లకల్లోలంగా వుంది. దీనికి పరిష్కారం ఏమిటి?

మనస్సు ఎటో పరుగులు తీస్తూ వుంటే గదిలోకెళ్లి తలుపులు మూసుకుంది.

మరి కొన్ని రోజులు గడిచాయి.


ఓరోజు మహిళా మండలికి వెళ్లేసరికి ఏవో తర్జనభర్జనలు చేస్తున్నారు మహిళా మణులు.

కొంత సేపు అలా నిలుచున్నాక విషయం అర్థం అయింది అంజమ్మకి.

ఈ వార్షికోత్సవానికి ఎలాగైనా ఓ ప్రముఖ రచయిత్రిని సన్మానించాలి!

''ఐతే ఇంకేం ఇందువదననే సన్మానిస్తే సరి!'' అంది జయశ్రీ రెడ్డి.

అందరూ తందానా తాన పాడేరు.



''ఇంతకీ మా ఇందు ఇందుకు ఒప్పుకుంటుందో లేదో? ఆమెకి ఈ సన్మానాలూ అవీ ఇష్టం వుండవు.'' అంది భానుమతీ జనార్దన్ లోలోపల సంతోషపడుతూ.

అంజమ్మ ముఖంలో కూడా ఆనందం తొంగి చూసింది. ''ఏమండీ ఐతే ఇందువదనగారు వస్తున్నారన్నమాట.''

''వస్తున్నారన్నమాట ఏమిటి మన ప్రెసిడెంట్‌గారు తలుచుకోవాలిగాని ఎందుకు రారూ!'' అన్నారు అందరూ ఏక కంఠంతో.

''వెంటనే మళ్ళీ అన్నారు. అయినా నీకు రచయితల గోల ఎందుకు? నీ పనేదో నువ్వు చూసుకో''

''నాకు రచయిత్రులంటే చాలా యిష్టం అండీ'' అంది అంజమ్మ అమాయకంగా ముఖం పెట్టి.

''ఏమిటీ నాలుగు సీరియల్ కథలు చదివినంత మాత్రం చేత రచయిత్రుల మీద ప్రేమాభిమానాలు ఏర్పడ్డాయా?'' అంటూ నవ్వారు మళ్లీ అందరూ.

అంజమ్మ ముఖం చిన్నబోయింది.

గవర్నమెంట్ హాస్పిటల్‌కి కొత్తగా వచ్చిన డాక్టర్ ప్రతిభామూర్తిని స్పీకర్‌గా పిలవాలనుకున్నారు. ఆయన ఆరోజు ఎయిడ్స్ గురించి మాట్లాడుతారు.

''ప్రతిభామూర్తిగారా?'' అంది అంజమ్మ ఆందోళనగా.

''ఏం ఆయన కూడా నీకు తెలుసా? ఆయన చాలా పెద్ద డాక్టర్. ఈ మధ్య ఒక ఆమె కడుపు నొప్పితో బాధపడుతూ హాస్పటల్లో చేరితే, పదికేజీల కణితిని తీశాడు ఆపరేషన్ చేసి. ఇప్పుడామె హాయిగా వుంది.''

''నువ్వూ వస్తావుగా వార్షికోత్సవానికి. అప్పుడు చూద్దువుగాని ఆ వైభవాన్ని.'' అంది సవితా ప్రమోద్.

అందరి మాటలు విని అంజమ్మ, ఆనంద విషాదాల మేలుకలయిక ఆమె అంతరంగం.

తడబడే అడుగులతో ఇంటివైపు నడిచింది అంజమ్మ. రాబోయే రోజుకోసం ఎదురుచూస్తోంది ఆమె మనో నేత్రం.

★★★

ఆరోజు ఆదర్శ మహిళా మండలి వార్షికోత్సవం.

ఆ ప్రాంగణంలో ఆనందోత్సాహాలు తాండవిస్తున్నాయి. రంగు రంగుల విద్యుద్దీపాలతో ఇంద్రలోకంలా వుందా క్లబ్.

పట్టుచీరల రెపరెపలు; ఫ్యాన్సీ చీరల జిగజిగలు, ఒకటేమిటి అంతా ఓ కొత్త ప్రపంచం.

ఇందువదన వచ్చింది. అందరూ ఆమెని చుట్టుముట్టారు.

''రచనలకు మీకు ప్రేరణ ఏమిటి? రచయిత్రిగా మీ అనుభవాలేమిటో వివరిస్తారా?'' అంటూ అడుగుతున్నారు.

''అన్నీ స్టేజిమీద చెప్తుందిగా!'' అంటూ సున్నితంగా త్రోసిపుచ్చి, తనతో లోపలికి తీసుకెళ్లింది భానుమతీ జనార్దన్ ఇందువదనని.

''ఈ ఇంపోర్టెడ్ శారీ మా తమ్ముడు కొనియిచ్చాడు. ఇక్కడ దీని ఖరీదు చాలా ఎక్కువే వుంటుంది.'' అంటోంది ఓ క్లబ్ మెంబర్.

నీలిరంగు పట్టు చీర జరీ అంచు సర్దుకుంటూ స్టేజి మీద కొచ్చి మైకు ముందు నిలుచుని అందర్నీ ఆహ్వానించింది స్వయంప్రభాదేవి.

డాక్టర్ ప్రతిభామూర్తిగారు వచ్చి తన ఆసనాన్ని అలంకరించారు.

ఇందువదన వయ్యారాలు ఒలకపోస్తూ వచ్చి కూచుంది.

స్వయంప్రభాదేవి ప్రతిభామూర్తిగారిని గురించి, వైద్యవృత్తిలో ఆయన ఎంత గొప్పవాడో వివరించింది.

సభ నిశ్శబ్దంగా వుంది. అంజమ్మ వచ్చి వెనక బెంచీ మీద కూర్చుంది.

ఇందువదనని చూసి దిగ్భ్రాంతి చెందింది. ఆమెని ఎక్కడో చూసిన గుర్తు, ఎక్కడ? ఎక్కడ?

స్వయం ప్రభాదేవి ఇందువదనని సభకి పరిచయం చేసింది.'' అనతికాలంలోనే ఎంతో ఎత్తుకు ఎదిగిన ఇందువదనలాంటి రచయిత్రులు సమాజానికి కావాలిప్పుడు. ఆమె రచనలు సామాజిక స్పృహ కలిగివుంటాయి.''

ఏవేవో మాట్లాడుతోంది స్వయంప్రభాదేవి.

అంజమ్మలో ఏవో జ్ఞాపకాలు. సరిగ్గా రెండేళ్ళ క్రితం కాకినాడలో తామున్నప్పుడు ఎదురింట్లో వుండేదా అమ్మాయి. అందరూ 'అమ్మాజీ' అని పిలుస్తూ వుండేవారు.

''నాకు కథలు రాయడం సరదా అండీ! ఇది రాశాను చూడండి!'' అంటూ ఏవో కాగితాలు తెచ్చి చూపిస్తూ వుండేది. ఆమె ఇప్పుడు రచయిత్రి. ఆనందరేఖ కదిలింది అంజమ్మ ముఖంలో.

డాక్టర్ ప్రతిభామూర్తి ఎయిడ్స్ గురించి ఓ అరగంట మాట్లాడేడు. తరువాత ఇందువదనకి సన్మానం జరిగింది భారీ ఎత్తున.

ఆ సన్మానానికి ఇందువదన పెద్దగా ఆనందించలేదు. ఆమె ముఖంలో నల్లమబ్బులు కమ్ముకున్నాయి.

పాత్రతాపాత్రలు గ్రహించడం లేదెవరు.

''సన్మాన గ్రహీత ప్రతివచనం!'' అంటూ మైకు ముందుకొచ్చి చెప్పింది సెక్రటరీ భానుమతీ జనార్దన్.

మెల్లగా మైకు దగ్గరకొచ్చింది ఇందువదన.

''నాకు మీరు చేసిన ఈ సన్మానానికి కృతజ్ఞతలు. కాని..కాని..నేను ఈ సన్మానానికి అర్హురాలినా అనిపి స్తోంది.! 'దూరపుకొండలు నునుపు' అనే సామెత రుజువయ్యిందిప్పుడు. నేను ఏడెనిమిది జిల్లాల అవతలున్నాను. పైగా క్లబ్ సెక్రెటరీగారికి బంధువుని. అందుకే..అందుకే ఈ సన్మానం.''

కాని..కాని మన మధ్యలోనే వున్న మహోన్నత వ్యక్తుల్ని కూడా మనం గ్రహించలేము.

ఇదే సభలో ప్రఖ్యాత రచయిత్రి కలహంగారున్నారు! వారు ఈ సభావేదిక మీదకు రావలసిందిగా కోరుతున్నాను'' అంది.

వెనక బెంచీలో కూచున్న ఆమె లేచింది. సాదానేత చీర, నుదుట పైన అంతా కుంకుమబొట్టు, బిగుతుగా అల్లుకున్న జడ, స్టేజి మీదకు నడిచి వచ్చింది.

అందరూ ఆశ్చర్యంతో నోరు వెళ్లబెట్టారు.

ఇన్నాళ్లూ తమ చేత అనుక్షణం అవమానింపబడుతూ, సాదా సీదాగా వుండే తెలుగు గృహిణి అంజమ్మ 'ప్రఖ్యాత రచయిత్రి కలహంసా?'

అందరి వదనాలూ సిగ్గుతో వాలిపోయాయి.

ఇందువదన ఆమెకి పాదాభివందన చేసింది. తనకి కప్పిన శాలువాని తీసి ఆమెకి కప్పింది.

ఆశ్చర్యపోయింది అంజమ్మ.

''మేడమ్ నిజంగా ఈ సన్మానానికి నేను అర్హురాలిని కాను. ఇందుకు మీరు అర్హులు..'' అని సభాసదులను ఉద్దేశించి మళ్ళీ ఇలా అంది. ''ఈమె ప్రఖ్యాత రచయిత్రి కలహంసగారు. ఈనాడు ఈమె రచనలేని పత్రిక లేదంటే అతిశయోక్తి కాదేమో. ఈమె నిగర్వి, ప్రచారాలకి ప్రశంశలకి ఇష్టపడరు.

మరొక్క ముఖ్య విషయం. ఈమెకి సాహిత్య అకాడమీ బహుమతి వచ్చింది. త్వరలోనే ఢిల్లీలో జరగబోయే తెలుగు మహాసభలో యాభై వేల రూపాయల బహుమతి అందుకుంటారని తెలియజెయ్యడానికి సంతోషిస్తున్నాను.

ఆమె ఒక మహోన్నత వ్యక్తి. ఒకప్పుడు నేను నా రచనలకి ఆమె దగ్గిరే ఓనమాలు దిద్దుకున్నాను.

మరొక్క విషయం. ఇంత సేపూ డాక్టర్ ప్రతిభామూర్తిగారు ఎయిడ్సు వ్యాధి గురించి మాట్లాడేరు. కాని..కాని..మనసుకి పట్టిన ఎయిడ్సు సంగతి ఏం చెయ్యాలి? దీన్ని గురించి ఎవరు బోధిస్తారు. దీనికి తీసుకోవలసిన జాగ్రత్తలేవి?

నాకు డాక్టర్ ప్రతిభామూర్తిగారి గురించి తెలుసు. ఆయనకి నేను తెలుసు. నేనే చెప్పద్దన్నాను మా పరిచయం గురించి.''

అందరి ముఖాలలోనూ ప్రశ్నార్థకం.

''మరొక్క విషయం మీకు తెలియాలి. కలహంస గారు ఎవరో కాదు. డాక్టర్ ప్రతిభామూర్తిగారి ధర్మపత్ని. 'ఆదర్శ గృహిణి!' నేను కాకినాడలో చదువుకుంటున్నప్పుడు తరుచు వీళ్లయింటికి వెళ్లేదాన్ని. ఈ భార్యాభర్తలు నన్ను వాళ్ల బిడ్డలా చూసుకుని ఆదరించేవారు.

ఆదిదంపతుల లాంటి వాళ్ళని ఇప్పుడు మళ్లీ చూస్తున్నందుకు నాకు మహదానందంగా వుంది. ఇంతకు మించి నేనేమీ చెప్పలేను. ఆనందంతో నా నోట మాట రావటం లేదు.''

''కాని మన మధ్య ఎలాంటి మనుష్యు లున్నారో? వాళ్లలో ఏయే ప్రతిభలు దాగివున్నా యో గ్రహించగలగాలి! దూరపుకొండలు నునుపు అనే భావన నశించాలి. అంతే కాదు. మనిషిని మనిషిగా చూడగలిగిన నాడే సమాజం బాగుపడుతుంది. మనం పురోగమించగలం.''

క్షణ కాలం ఆగింది ఇందువదన.

మళ్లీ ఇలా అంది. ఇందాక గెస్టు రూంలో ప్రతిభామూర్తిగారితో మాట్లాడుతున్నప్పుడు అన్నారు. అంజమ్మగారి గురించి, ఆమెకి ఈ క్లబ్‌లో ఎలాంటి ఆదరణ లభిస్తూందో.

ఇవన్నీ అన్నందుకు నన్ను క్షమించమని క్లబ్ కార్యవర్గ సభ్యుల్ని, అధినేతల్ని వినయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను.'' అంటూ కూర్చుంది.

క్లబ్ ప్రెసిడెంట్, సెక్రటరీ, మిగతా సభ్యుల ఎదలలో అలజడి.

ఒక్కసారి స్వయం ప్రభాదేవి, భానుమతీ జనార్దన్ స్టేజి మీదకి పరుగెత్తికెళ్లారు. ''మేడమ్ మమ్మల్ని క్షమించండి. మేం మూఢులం. మీరు ఎప్పుడూ మా క్లబ్‌కి రండి. పెద్ద గ్రంథాలయం వుంది. మీకు కావలసిన పుస్తకాలు తీసుకోండి. మీ అమూల్యమైన సలహాలు, సూచనలు మాకు అందించండి.''

అంజమ్మ పెదాల మీద చిరుదరహాసం వెలిగింది. వీళ్లందరి దగ్గరా సెలవు తీసుకుని డాక్టర్ ప్రతిభామూర్తి, అంజమ్మ కదిలారు.


కారు కదిలింది.

వాళ్లందరూ అంజమ్మని...కాదు ప్రఖ్యాత కథ, నవలారచయిత్రి కలహంసని చూస్తూ అనుకున్నారు.

'ఎంత పొరపాటు జరిగింది' అని.

పశ్చాత్తాపంతో వాళ్ళ హృదయాలు బరువెక్కాయి.

★



## టాబూ ఫాన్

నటకిరీటి రాజేంద్రప్రసాద్ ఈ మధ్యనే ఓ ఆంగ్ల సినిమా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'మొదట్లో నాతో నటించి, హఠాత్తుగా ప్రముఖ హీరోయిన్‌లుగా అయిపోయినవాళ్ళు, ఆ తర్వాత నాతో నటించిన విషయమే మరిచిపోయినట్టుగా ప్రవర్తించడం అప్పుడప్పుడు నాకు అనుభవంలోకి వస్తూ ఉంది. అది నాకు చాలా బాధ కలిగించే విషయం. కాని ఏం చేయగలం?'' అన్నాడు వేదాంత ధోరణిలో! అలాగే ''హిందీ హీరోయిన్‌ల 'సంబంధాలు'గురించి వింటుంటే నాకు చాలా జెలసీగా ఉంటుంది. అందుకే అలాంటివాళ్ళతో వర్క్ చేయడం నాకు అంతగా సంతోషంగా అనిపించదు'' అంటూ చెప్పుకొచ్చాడు. ఆ విలేఖరి ''మరి మీకు అభిమాన హీరోయిన్ ఎవరు?'' అని ప్రశ్నిస్తే, నవ్వుల రాజేంద్రుడు వెనువెంటనే ''టాబు'' అని చెప్పాడు. ''కొద్దిరోజుల క్రితం నేనున్న ఓ సెట్‌కి ఆమె వచ్చినప్పుడు ఈ విషయమే ఆమెకు చెప్పాలనుకున్నాను. కాని చెప్పడానికి ధైర్యం చాలలేదు.'' అంటూ నవ్వేసాడు రాజేంద్రుడు.

-జె.వి.బాబు